

# కోకో కోలా

పార్వతి స్కూల్‌నుంచి ఇల్లు చేరేసరికి సాయంత్రం ఆరుగంటలయింది. స్టాఫ్ మీటింగులో చేసే బ్రహ్మాండమైన తీర్మానాలేమీ వుండవు గానీ మీటింగు జరిగిన రోజు ఆలస్యమూ అలసటా తప్పవు. వస్తూనే వరండాలో ఆడుతున్న క్రాంతీ, తలుపుకు వేళాడుతున్న తాళం కనిపించేసరికి నీరసంతో కళ్ళు తిరిగాయి. వస్తున్నంతసేపూ శ్రీనివాస్ వేడిగా యిచ్చే కాఫీ తాగి ఓ అరగంట కళ్ళు మూసుకొని పడుకోవాలని కలలు కంటూ వచ్చింది. శ్రీనివాస్‌మీద కోపం ముంచుకు రాబోతుండగా గుర్తొచ్చింది అతనికీ రోజు ముఖ్యమైన పని వుందని.

చంకనెక్కిన క్రాంతిని ముద్దు చేస్తూనే తాళం తీసి లోపలికి వచ్చింది. సీసాలోంచి బఠాణీలు తీసి క్రాంతికిచ్చి కాఫీ కలుపుకుందామని వెళ్తే ఆ కాఫీ గిన్నె మిగిలిన అంట్లన్నిటితో పాటు సింకులో వుంది. అదొక్కటీ కడిగి కాఫీ తాగి మిగిలిన వాటి పని పట్టటం కంటే అంట్లన్నీ టి.వీ సూపర్ విమెన్ తోమినట్లు పరపరా తోమి, తనూ పాపా స్నానం చేసి అప్పుడు తీరిగ్గా కాఫీ తాగి

ఓ గంట విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందనిపించింది. తళ తళ తప్ప ఏమీ మిగల్చని విమ్ పౌడర్ని పళ్ళెంలో వేసుకుని కసిగా అంట్లు రుద్దటంలో పడిపోయింది.

"పార్వతీ పార్వతీ- నాకు ఉద్యోగం వచ్చింది" ముందుగదిలో చెప్పులు విడుస్తూనే ఆనందంతో అరిచేశాడు శ్రీనివాస్. పార్వతి ఆ మురికి చేతుల్తో అలాగే వచ్చేసింది. శ్రీనివాస్ ముఖం చూస్తే "నిజమా?" అని కూడా అడగనక్కర్లేదని తెలుస్తూనే వుంది.

పార్వతి ఆనందంతో ఉక్కిరి బిక్కిరై ఆ మురికి చేతుల్తోనే శ్రీనివాస్ ముఖం పట్టుకుని నుదుటి మీద ముద్దు పెట్టింది. ఆమెకు గుండెలమీద నుంచి టన్నుల కొద్ది బరువు దిగిపోయి మనసు శరీరం గాల్లో పావురాయి ఈకలా ఎగిరిపోతున్న అనుభూతి కలిగింది.

సంవత్సరం క్రితం ఏ.పి. స్కూటర్స్ కంపెనీ మూతబడటంతో శ్రీనివాసరావు వుద్యోగం వూడింది. అక్కడ సేల్స్ సూపర్వైజర్ గా పనిచేసేవాడతను. పార్వతి ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేస్తోంది. ఇద్దరూ కోస్తా జిల్లాలనుంచి ఉద్యోగార్థం హైదరాబాదు చేరినవాళ్ళు.. శ్రీనివాసరావు ఎమ్. కామ్ చదివాడు. పార్వతి బి.య్యస్సీ చదివింది. ఉద్యోగాలకోసం హైదరాబాదు వచ్చి కాస్త మంచి ఉద్యోగాలే సంపాదించుకున్నారు. ఏదో సాహిత్య సభలో పరిచయం జరిగింది యిద్దరికీ- అది ప్రేమగా మారింది. వాళ్ళ పెళ్ళయిన అయిదేళ్ళకు కూడా ఆ ప్రేమ ప్రేమగానే వుందంటే కేవలం యవ్వనోద్రేకం కాదనే అనుకోవాలి. ఇద్దరి జీతాలూ, ఒక్కతే కూతురు. వాళ్ళకు జీవితం హాయిగానే గడిచేది. పొదుపు చేసే అలవాటు యిద్దరికీ లేదు. ఇద్దరికీ సంగీతమన్నా సాహిత్యమన్నా యిష్టం. సభలకూ. సమావేశాలకూ తిరగటం యిష్టం.

సినిమాలూ, నాటకాలూ-చెప్పే పనిలేదు. ఐదేళ్ళపాటు యిట్లాంటి జీవితానికి అలవాటు పడిన వాళ్ళకు శ్రీనివాస్ ఉద్యోగం వూడటంతో హఠాత్తుగా గాల్లో ఆక్సిజన్ మాయమైనట్లు ఉక్కిరిబిక్కిరయ్యారు. అలవాటు లేని అప్పులు చెయ్యక తప్పలేదు. సరదాలు చంపుకోకా తప్పలేదు. చికాకులూ, చీదరలూ పడకా తప్పలేదు. ప్రేమను నాశనం చేసే శక్తి దరిద్రానికున్నట్లు మరి దేనికీ లేదని వాళ్ళకు నెమ్మదిగా తెలిసొచ్చింది. ఆ దరిద్రాన్నించి ప్రేమను రక్షించుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

శ్రీనివాసరావు ఉద్యోగ ప్రయత్నాలకే ఎక్కడి డబ్బూ చాలటం లేదు. ఇక సొంతవూరికి వెళ్ళిపోదామా, వున్న నాలుగెకరాల్లో తనవాటా రెండెకరాలూ దున్నుకుంటూ, మరో నాలుగెకరాలు కౌలుకి తీసుకుని వ్యవసాయంలోకి దిగుదామా అనే ఆలోచనా వచ్చిందతనికి. పార్వతికి ఆ మాటా చెప్పాడు. 'అట్లా ఒద్దులే' అని ఏం చెయ్యాలో ఏం చెయ్యమనాలో పార్వతికీ తెలియదు.

"ఏప్రిల్ లో మా స్కూల్కి శలవలిచ్చినపుడు వూరికి వెళ్తాంగదా. అపుడు బావగారితో మాట్లాడి నిర్ణయించుకోవచ్చు" నంది బిక్కముఖం వేసి. పార్వతి ముఖం చూస్తే శ్రీనివాసరావుకి జాలేసింది. పార్వతి తన ప్రతి ఆలోచనకూ సహకరించటం చూస్తే అతనికెంతో ఆనందం.

"చలో దిల్దార్ చలో",చాంద్కీ పార్ చలో" అని తను పాడితే "హమ్ భి తయ్యార్

చలో'' అంటూ తయారయ్యే పార్వతి అంటే అతనికి ప్రాణం.

పార్వతికి సంగీతమంటే, సాహిత్యమంటే వున్న అభిరుచి ఆ వూళ్ళో ఎట్లా తృప్తి పడుతుంది?ఇక్కడ నెలకు రెండు సంగీత సభలకన్నా వెళ్తారు. సాహిత్య సభలూ తరచు జరుగుతుంటాయి. ఏవో ఫెస్టివల్స్ జరుగుతాయి. మొన్నటికి మొన్న చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది. మంచి మంచి సినిమాలు కానీ ఖర్చు లేకుండా చూసారు. ఇవన్నీ ఆ పల్లెటూళ్ళో ఎట్లా దొరుకుతాయి? పట్నం కేవలం డబ్బు సంపాదన కోసమే వస్తే డబ్బులేదనుకున్నపుడు పట్నం ఒదలటానికి యింత బాధ వుండేదికాదు. ఉద్యోగార్థం వచ్చినా యిక్కడి జీవితం తనకూ పార్వతికీ ఎంతో బాగుంది. తమ జ్ఞానదాహం కాస్త చల్లారుతోంది. ఇపుడవన్నీ ఒదిలి వెళ్తే పార్వతి జీవితంలో చాలా వెలితి ఏర్పడుతుంది.

కానీ ఏం చెయ్యటం?

ఈ ఆలోచనల్తో శ్రీనివాసరావు ఆరోగ్యమూ పాడవుతోంది. దానిని చూసి పార్వతికి బెంగగా వుంది. అందువల్లే యివాళ శ్రీనివాసరావు చెప్పిన చల్లని మాట వినగానే పార్వతికి ఆనందంతో పాటు దుఃఖమూ ముంచుకొచ్చింది.

చేతుల మురికంతా భర్త తెల్లచొక్కాకు అంటుతున్నా అతన్ని కావలించుకుని అతని భుజం మీద తలపెట్టి ఐదునిమిషాలు ఆపకుండా ఏడ్చింది. శ్రీనివాసరావుకూ కళ్ళంట నీళ్ళొచ్చాయి.

'పాపం పిచ్చి పిల్ల.సంవత్సరం నుంచీ ఎంత యాతన పడుతోందో అదంతా యిక వుండదనుకుంటే తట్టుకోలేక పోతోంది' అనుకున్నాడు. పార్వతి తనను తాను సంబాళించుకుని శ్రీనివాసు నుంచి దూరం జరిగి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ

"ఎక్కడా? ఏ ఉద్యోగం?"అనడిగింది.

"పాత ఉద్యోగమే. సేల్స్ సూపర్‌వైజర్"

"ఏ కంపెనీ?"

"కోకాకోలా!"

పార్వతి అయోమయంగా చూసింది.

"ఔను. కోకాకోలా డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలో - మరో వారంలో హైదరాబాదుకు కోకాకోలా వచ్చేస్తోంది. ఒక ఏరియా సేల్స్ సూపర్ వైజర్‌ని నేను. చాలా మంచి జీతం. ఎంతో చెప్పకో?" పార్వతి ముఖం హఠాత్తుగా కఠినంగా మారింది.

"ఎంతైనా నువ్వు ఒప్పుకోవద్దు."

"అదేంటి?" శ్రీనివాస్ బిత్తర పోయాడు.

"మనదేశంలోకి కోకాకోలా రాకుండా ఆపలేకపోయాం. అది చాలక యింకా దానికోసం

పనికూడా చెయ్యాలా?"

పార్వతికి కోపం ఆగటం లేదు.

"నీకేమన్నా పిచ్చా? కోకాకోలా రాకుండా ఆపటం మన తరమా?"

"కాదు - అందుకే ఏమీ చెయ్యలేదు మనం. కానీ ఆ కంపెనీలో ఉద్యోగం ఒద్దు."

శ్రీనివాసరావు పార్వతి వెర్రితనానికి ఏం చెయ్యాలో తెలియని వాడిలా నిస్సహాయంగానూ, తన ఆనందాన్ని భగ్నం చేసినందుకు కోపంగానూ ఆమె వైపు చూస్తూ నిలబడిపోయాడు.

"నీకు తెలియదు శీనూ- 77 లో కోకా కోలా మన దేశానికి రాకుండా జనతా ప్రభుత్వం చట్టం చేసిన రోజు మా యింట్లో పండగ చేసుకున్నాం. ఆ రోజు మా నాన్న తను ఎమర్జెన్సీ అంతా జైల్లో వున్నందుకు కనీసం యిదైనా దక్కిందని ఎంతో సంతోషపడ్డాడు. నన్నూ మా రవినీ దగ్గర కూచోబెట్టుకొని కోకాకోలా గురించీ, అలాంటి విదేశీ కంపెనీల గురించీ ఎంతసేపో చెప్పాడు. నీకు తెల్సుగా మా నాన్న ఎమర్జెన్సీ కాలమంతా జైల్లో వున్నాడు. ఆరోగ్యం బాగా పాడయింది. అందువల్లే చచ్చిపోయాడు. నువ్వు ఈ ఉద్యోగంలో చేరితే మా నాన్న త్యాగాన్ని అవమానం చేసినట్లవదూ?"

శ్రీనివాసరావు నిస్సహాయంగా చూసి "పార్వతీ నీకు పిచ్చెక్కింది"అన్నాడు.

"పోనీ పిచ్చే అనుకో, ఆ ఉద్యోగం మాత్రం ఒద్దు. అసలు కోకాకోలా మన వూరు వస్తుందని విన్నప్పటినుంచే నాకు చాలా కోపంగా, దుఃఖంగా వుంది. పోయి, పోయి నువ్వా కంపెనీలోనే చేరాలా? మనం ఎన్ని సార్లు విదేశీ కంపెనీల గురించి మాట్లాడుకోలా? అసలు మీ ఫాక్టరీ మూతబడింది ఈ విదేశీ కంపెనీల మూలంగా కాదూ?"

"ఎందుకో కందుకు - మా ఫాక్టరీ అయితే మూతబడింది. నా ఉద్యోగం వూడింది. ఇప్పుడీ కంపెనీలో చేరటం దేశద్రోహమన్నట్టు మాట్లాడతావేంటి? ప్రభుత్వం అన్ని ఒప్పందాలూ చేసుకుంది. చట్ట ప్రకారం, ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం కోకాకోలా వస్తోంది. ప్రభుత్వం అనుమతించిన తర్వాత అదేదో దేశద్రోహమన్నట్టు మాట్లాడతావేంటి?"

పార్వతితో అంత కోపంగా శ్రీనివాస్ ఎన్నడూ మాట్లాడలేదు.

"దేశమంటే ప్రభుత్వమా?"

పార్వతి ప్రశ్న తిరుగులేని బాణంలా వచ్చి తగిలింది. ఏం జవాబు చెప్పాలో తెలియక, మరికాసేపు అక్కడవుంటే పార్వతితో ఎంత కఠినంగా మాట్లాడాల్సి వస్తుందో వూహించుకుని శ్రీనివాసరావు బైటికి వెళ్ళిపోయాడు.

☆ ☆ ☆

క్రాంతి ఆటలనుండి తిరిగొచ్చింది.

అమ్మ దిగులుగా కూర్చోవటం చూసి మాట్లాడకుండా పుస్తకాల సంచీ తీసింది. ఈ

ఏడాదిగా తలిదండ్రుల సమస్యల మధ్యలో తను ఎట్లా వ్యవహరించాలో నేర్చుకుంది ఐదేళ్ళ క్రాంతి.

శ్రీనివాసరావు ఓ గంట బైట తిరిగి మనసుని స్థిమితపరుచుకుని యింటికి వచ్చాడు.

పార్వతి యింకా అలాగే కూర్చుని వుంది. అతను స్నానం చేసి వచ్చి క్రాంతి దగ్గర కూచున్నాడు. క్రాంతి మెల్లిగా తండ్రి ఒళ్ళో చేరింది.

"నాన్నా కథ చెప్పవా?"" గారాంగా అడిగింది.

"'నాకు ఆకలిగా వుందమ్మా. అన్నం తిని చెప్పుకుందాం. అమ్మను అన్నం పెట్ట మను"

క్రాంతి తల్లి దగ్గరకు చేరి గారాలు పోయింది.

పార్వతి వంటింట్లోకి నడిస్తే శ్రీనివాస్ కూడా లేచి పీటలు వేసి కంచాలు పెట్టాడు. క్రాంతి మంచినీళ్ళు తెచ్చింది. క్రాంతితో కబుర్లు చెబుతూ భోజనాలు ముగించారు దంపతులు.

శ్రీనివాస్ క్రాంతికి కథ చెప్పి నిద్ర పుచ్చి పార్వతి దగ్గరకు వచ్చాడు.

ఆమె చాలా అశాంతిగా వుందని తెలుస్తూనే వుంది. శ్రీనివాస్ కి కూడా సాయంత్రపు కోపం తిరిగొచ్చింది.

"మీ తాతగారు స్వతంత్రోద్యమంలో జైలుకి వెళ్ళి చనిపోయారు. మీ నాన్నగారు ఎమర్జెన్సీలో జైలుకి వెళ్ళి చనిపోయారు. మంచిదే - గొప్ప విషయమే -కానీ దాని కారణంగా మనం దరిద్రం అనుభవించటం ఏమిటో అర్థం కావటం లేదు. మీ తాతగారి మూలంగా కనీసం ఐదెకరాలన్నా రాలేదు". శ్రీనివాస్ వ్యంగ్యానికి పార్వతి విలవిలలాడిపోయింది.

"ఔను. మా తాత, మా నాన్నల వల్ల మనకు దరిద్రం తప్ప ఏమీ రాలేదు. కానీ నాకు ఎంత ఆత్మగౌరవం వచ్చిందో నీకు తెలియదు. నా తరానికి వాళ్ళు స్వతంత్రం యిచ్చి వెళ్ళారు. మనం శుభ్రంగా దాన్ని పోగొట్టుకుని మన పిల్లలకు బానిసత్వం యిచ్చి పోదాం. మనం కోట్లు సంపాదించి క్రాంతికి యివ్వొచ్చేమో- కానీ మా తాతా, మా నాన్నా నాకిచ్చిన దానిముందు దీనికేమీ విలువలేదు. బొత్తిగా విలువలేదు.

నువ్వాలోచించు శ్రీనివాస్. ఈ మల్టీ నేషనల్ కంపెనీలు పుట్ట గొడుగుల్లా మనదేశంలో పుడుతుంటే దేశం ఏమవుతుంది?"

శ్రీనివాస్‌కి ఎట్లా పార్వతితో వాదించాలో తెలియలేదు. ఒక వ్యక్తిగా ఈ మొత్తం విధానాలను ఎదిరించటం కష్టమని ఆమెను ఒప్పించలేనని అతనికి తెలుసు. వ్యక్తి విలువలు, మనం పాటించాల్సిన పౌరధర్మాలు ఈ విషయంలో పార్వతికి చాలా పట్టు. రోడ్డు మీద ఎంత అవసరం ఒచ్చినా ఉమ్మి కూడా వేయదు. తన వరకు తను చాలా నియమాలు పాటిస్తుంది. అది శ్రీనివాస్‌కి నచ్చింది. చాలా విషయాలు ఆమె నుంచి నేర్చుకున్నాడు.

పార్వతిది మూర్ఖత్వమని వ్యక్తి- సమాజం - చర్చ ద్వారా నిరూపించలేదని అతనికి తెలుసు. ఎట్లా ఏం చెప్పి ఆమెను కాస్త సెన్సెస్‌లోకి తేవాలా అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు. చివరికేదో దారి దొరికింది.

"అసలు కంపెనీలు స్వదేశీవా విదేశీవా అని ఆలోచించే రోజులేనా యివి?స్వదేశీ కంపెనీలో లాభం నల్లదొరలకూ విదేశీ కంపెనీలో లాభం తెల్లదొరలకూ పోతుంది. కార్మికులకూ ఉద్యోగస్తులకైతే ఏమీ రాదు. మనల్ని ఎవరూ దోపిడీ చేయకుండా చూసుకోవటం ముఖ్యం గానీ దోపిడీ ఎవరు చేస్తున్నారనేది ముఖ్యంకాదేమో -నేను థమ్సప్ కంపెనీలో పని చెయ్యడానికీ, కోకాకోలాలో పని చెయ్యడానికీ ఏమిటి తేడా?"

పార్వతి మొదటిసారి జవాబు చెప్పలేని పరిస్థితిలో పడింది. లాభాలు, ప్రయోజనాలు సామాన్య జనానికి అందనపుడు ఎవరికి వెళ్తే ఏమిటి? టాటా, బిర్లాలకు వెళ్తే ఏమిటి? రాక్‌ఫెల్లర్ కు వెళ్తే ఏమిటి? ఏమీ తేడా లేదా?ఎందుకు ఉండదు?

మనదేశపు వాళ్ళయితే ఆ డబ్బుని మళ్ళీ ఈ దేశంలోనే పెట్టక తప్పదు. విదేశీయులు వాళ్ళదేశాలకు తరలించుకు పోతారు. మన ఎకానమీలోకి ఆ డబ్బు రాదు. అదీగాక మనం ఆర్థికంగా పరాధీనులమైతే ఎట్లా?

కానీ అవతల ప్రభుత్వం అన్ని కంపెనీలూ విదేశీయులకే అప్పజెప్పే ఆలోచనలో వుంది. వాటి పోటీతట్టుకోలేక దేశంలో యిప్పుడున్న కంపెనీలు క్రమంగా మూతబడిపోవచ్చు. అన్నీ విదేశీ కంపెనీలే రావొచ్చు. అపుడు ఎవరైనా ఏం చేస్తారు? అసలిదంతా ఎందుకు జరుగుతోంది? డిగ్రీ చదివే రోజుల్లో చరిత్రపుస్తకంలో ఈస్ట్ ఇండియా కంపెనీ గురించి చదివింది గుర్తొచ్చింది పార్వతికి. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో సృష్టించిన స్మశాన వాతావరణం గురించి విలియం బెంటిక్ అన్న మాటలు ఏ.సి. కాలేజీలో హిస్టరీ లెక్చరర్ ఐజాక్ సార్ ఆవేశంతో క్లాసురూం ప్రతిధ్వనించేలా చెప్పారు. ఆయన ఆ పరిస్థితిని అలా చెబుతుంటే విద్యార్థుల రోమాలు నిక్కబొడుచుకునేవి, ఆవేశంతో వూగిపోయేవారు. పార్వతి చెవుల్లో ఐజాక్ సార్ గొంతులో విలియం బెంటిక్ మాటలు ప్రతిధ్వనించినట్లయింది .

"వ్యాపార చరిత్రలో యింతటి దారుణమూ,దయనీయమూ అయిన పరిస్థితి మరొకటి వుండదు. భారతదేశమంతా చేనేత కార్మికుల ఎముకలతో వెల్లవేసినట్లు తెల్లబడి పోయింది."

పోయిన సంవత్సరమంతా మళ్ళీ ఆ చరిత్ర పునరావృతం కాలేదూ? ఎంతమంది చేనేతకార్మికులు ఆకలి చావుల బారిన పడలేదూ? మళ్ళీ ఈస్ట్ ఇండియా కంపెనీ రోజులూ, ఆ తర్వాత విదేశీ పాలనా అన్నీ రాబోతున్నాయా?

పార్వతికి అంతా గందరగోళంగా అనిపించింది. అంత దారుణం జరగదు. తను అతిగా ఆలోచిస్తోంది అనిపించింది. ఎదురుగా దీనంగా ముఖం పెట్టుకుని కూచున్న

శ్రీనివాస్‌ని చూస్తే జాలీ, ప్రేమా ముంచుకొచ్చాయి. పార్వతి ముఖంలో క్రమంగా వస్తున్న మార్పు చూస్తుంటే శ్రీనివాస్‌కి కొండంత బలం వచ్చింది.

"పార్వతీ- ఇంకా వారంరోజులు టైముంది. నెమ్మదిగా ఆలోచించుకుని చేరొచ్చు. కనీసం మరో మంచి ఉద్యోగం దొరికేదాకా చేయవచ్చు."

పార్వతిని తన కౌగిట్లోకి తీసుకుని తలమీద ముద్దు పెట్టుకుని -

"బుర్ర వేడెక్కింది-తగ్గించనా?" చెవిలో గుసగుసలాడాడు. పార్వతి నీరసంగా నవ్వింది.

"నువ్వు పడుకో - నాకీ బుర్ర యిలా వుంటే నిద్రపట్టదు. కాసేపు ఏ 'వైతాళికుల్లో' వో నాలుగు మంచికవితలు చదువుకుంటే కాస్త నా నరాలు శాంతిస్తాయేమో చూస్తాను."

మంచం మీదనుంచి లేచి పుస్తకం తీసుకుని టేబిల్ లైటు దగ్గర కుర్చీలో కూర్చుంది.

ఎంతో యిష్టమైన కవితలమీదకు కూడామనసు పోలేదు. వైతాళికులు లాభం లేదని కృష్ణపక్షం తీసుకుంది.

"జగమునిండ స్వేచ్ఛాగాన ఝురుల నింతు"

కృష్ణశాస్త్రి రొమాంటిక్ ప్రపంచంలోకి పార్వతి మనసు ప్రవేశించ నిరాకరించింది.

స్వేచ్ఛ- కోల్పోబోతున్న స్వేచ్ఛ - వేళ్ళ సందుల్లోంచి మనకు తెలియకుండా జారిపోతున్న స్వేచ్ఛ - అది నిజమేనా- తన ఊహలేనా?

శ్రీనివాస్ స్వేచ్ఛను తను హరిస్తోందా? ఆ ఉద్యోగం వద్దని తను బలవంతం చెయ్యటం అతని స్వేచ్ఛను హరించటం కాదా? అతన్ని నిర్ణయించుకోనీ-

ఈ సిటీ జీవితం అతనికీ యిష్టం. ఇద్దరికీ హాయిగా జరిగిపోతోంది.

ఊరికి వెళ్ళి నాలుగెకరాల వ్యవసాయంతో మళ్ళీ మొదట్నించీ ప్రారంభించగలమా? పాప సంగతేమిటి? ఆమె చదువు సంధ్యలు?

తను అనవసరంగా ఆందోళన పడటమేగాని దేశం సంగతి ఎవరికి పట్టింది?

తన భర్త ఒక్కడూ ఆ విదేశీ కంపెనీలో ఉద్యోగం మానేస్తే విదేశీ కంపెనీలు మూతబడతాయా? ఏదైనా ఒక ఉద్యమం వుంటే అది వేరే సంగతి. స్వదేశీ ఉద్యమం మళ్ళీ వొస్తుందా?రావాలా? ఒస్తే అప్పుడు చాలామంది యిట్లా తనలా ఆలోచిస్తారా?పార్వతికి రవీంద్రనాధ ఠాగూర్ రాసిన 'ఇంటా-బయటా' నవల గుర్తొచ్చింది.

ఆ నవలలో 1905 లో బెంగాల్‌లో నడిచిన స్వదేశీ ఉద్యమం చిత్రించాడు ఠాగూర్. ఒక విధంగా అది స్వదేశీ వుద్యమం మీద విమర్శ. ఆ నవలలో స్వదేశీ వుద్యమ నాయకుడు నిజాయతీపరుడు కాదు. అతను తన రాజకీయ లక్ష్యాన్ని చేరుకోటానికి ఎన్నో నీచమైన ఎత్తుగడలు వేస్తాడు.అతని స్నేహితుడు జమీందారు వ్యక్తిగా మంచివాడు. విదేశీ వస్తువులు చౌకగా వస్తున్నంతకాలం ప్రజలు వాటిని కొంటారు. వాటిని తగలెయ్యటం కంటే అంత చౌకగా స్వదేశీ వస్తువుల్ని ఉత్పత్తి చేయాలంటాడు. దానికోసం పని చేయాలంటాడు.

ప్రజల ఎమోషన్స్ ని రెచ్చగొట్టి విధ్వంసం వైపు నడిపించటమా?

ఒక నిర్మాణాత్మకమైన ఆలోచనతో పని చేయటమా? ఏది సరైంది?

కానీ యిప్పటి పరిస్థితి వేరు.

మనకు ఉత్పత్తి చేసుకోగల పరిస్థితులన్నీ వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల్లో కూరుకునివుండొచ్చు. వాటిని బాగుచేసుకోవటం అసాధ్యం కాదు. కుప్పకూలిపోతుందనుకున్న హైదరాబాదు E.C.I.L కాసరలాద చొరవతో, కార్మికుల కష్టంతో నిలబడలేదూ?

ఔను -దేశం బాగోలేదు.అవినీతి, మోసాలు,రాజకీయ అస్థిరత్వం, ఏ ఒక్క రాజకీయ పార్టీకీ సరైన అవగాహనా ఆలోచనా లేకపోవటం, తమ చిన్న గ్రూపు ప్రయోజనాలకు మొత్తం దేశాన్నీ బలి చెయ్యటం-

సరిగ్గా ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశానికి వ్యాపారం అంటూ వచ్చే ముందున్న పరిస్థితి యిట్లాంటిదే కావచ్చు. వ్యాపారం పేరుతోనే, రాజులకు రుణాలిచ్చి సహాయపడే నెపంతోనే అది మనస్వతంత్రాన్ని హరించింది. కానీ - ఒక సుస్థిర సామ్రాజ్యం లేని ఆ పరిస్థితుల్లో అంతకంటే గత్యంతరం లేదేమో– కానీ యిపుడలా కాదు. ప్రజల్లో చైతన్యం వుంది. ఒక్క వ్యక్తి అసమర్థత వల్ల, నిర్ణయాల వల్ల దేశం పతనం కావాల్సిన అవసరం లేదు.

కానీ అయిపోతోంది-

ఎందుకిట్లా జరుగుతోంది?

పార్వతి ఈ ఆలోచనల్తోనే ఆ కుర్చీలో కూర్చునే టేబిల్ మీద తలవాల్చి నిద్రపోయింది. మధ్యరాత్రి శ్రీనివాస్‌కి మెలకువ వచ్చి చూసి, మెల్లిగా లేపి మంచం మీద పడుకోబెట్టాడు.

☆ ☆ ☆

నాలుగు రోజుల అంతర్మథనం తర్వాత పార్వతి యిక ఈ అశాంతితో బతకలేననీ,శ్రీనివాస్ స్వేచ్ఛకు తను అడ్డం రాకూడదనీ నిర్ణయించుకుంది.

ఆ నిర్ణయం తీసుకున్నాక కాస్త ప్రశాంతంగా మారింది. ఐదోరోజు ఉదయం క్రాంతి సైకిల్ కావాలని పేచీ పెడితే "నాన్న రెండు రోజుల్లో ఉద్యోగంలో చేరుతున్నాడు. మొదటి నెల జీతం రాగానే కొనుక్కుందాం. సరేనా?" అంది శ్రీనివాస్ వంక నవ్వుతూ చూస్తూ.

శ్రీనివాస్‌కి అర్థమైపోయింది. అతనూ నిశ్చింతగా నవ్వాడు. మళ్ళీ యింట్లో ముగ్గురి నవ్వులూ, ఆటలూ పాటలూ అన్నీ మొదలయ్యాయి.

పార్వతి స్కూలుకి వెళ్ళే లోపలే నాలుగురోజుల్నించీ బాకీ పడిన నవ్వులన్నీ నవ్వేసుకున్నారు..

పార్వతీ క్రాంతీ స్కూలుకి వెళ్ళారు. శ్రీనివాస్ తన వుద్యోగ వార్త స్నేహితుల్తో చెప్పటానికి బైటికి వెళ్ళాడు.

☆ ☆ ☆

ఆ రోజు సాయంత్రం పార్వతి స్కూలు నుంచి వచ్చేసరికి శ్రీనివాస్ పనంతా ముగించి బైటికి వెళ్ళటానికి తయారైవున్నాడు.

పార్వతి కాళ్ళూ ముఖం కడుక్కుని, పాపకూ కడిగి బట్టలు మార్పించి వచ్చేసరికి చపాతీలూ, కూరా ప్లేట్లలో సర్దివుంచాడు.

"ఏమిటీ హడావుడి?"ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"సినిమాకి? వెళ్తున్నాం" పాటలాగా పాడాడు.

"ఏ సినిమాకి?" అనుమానంగా అడిగింది పార్వతి.

శ్రీనివాస్‌కి అమితాబ్ బచ్చన్ సినిమాలు యిష్టం. అమితాబ్ బచ్చన్ యిష్టం. నేషనల్ ఇంటిగ్రిటీకి ఏకైక సంకేతం అమితాబేనని వాదిస్తాడతను.

"అమితాబ్ సినిమా కాదు. అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్, షారూక్ ఖాన్‌ల సినిమాలు కూడా కాదు. నీ కిష్టమైన ఫిల్మ్ సొసైటీ సినిమా. ప్రకాష్‌రెడ్డి గారు మధ్యాహ్నం కనబడి చెప్పారు.సాయంత్రం మంచిసినిమా వేస్తున్నాం ఏ మాత్రం వీలున్నా రండి అని లాటిన్ అమెరికన్ సినిమానో ఏదో అన్నారు- నాకు సరిగా గుర్తులేదు."

పార్వతికి భయం పోయి ఉత్సాహం వచ్చింది. క్రాంతిని బతిమాలి ఒప్పించి పక్కింటి ఆవిడకు ఒప్పగించి వచ్చింది.

పార్వతికి ఫిలిం సొసైటీ వాళ్ళు వేసే సినిమాలు, అందులోనూ అమెరికన్, బ్రిటీష్ సినిమాలు కాకుండా యితర దేశాలవి చాలా యిష్టం. సబ్‌టైటిల్సు వుండటంతో బాగా అర్థమవుతాయి.

ఇద్దరూ హడావుడిగా బస్సు పట్టుకుని సారథీ స్టూడియో దగ్గర దిగారు.

అప్పటికే ఆరు దాటిపోతోంది.

"సినిమా మొదలు పెట్టేశారేమో" అంది పార్వతి.

"మొదలు పెట్టరు. ఆ సినిమా డైరెక్టరు కూడా వచ్చాడట. ముందు చిన్న మీటింగు వుంటుంది. అది పూర్తయ్యేసరికి అరగంటన్నా పడుతుంది". తాపీగా చెప్పాడు.

పార్వతి కంగారుగా ముందెందుకు చెప్పలేదని కోప్పడింది.

"ఎందుకు? చెబితే ఏం చేసేదానివి?"

"ఆటోలో వచ్చేవాళ్ళం. ఆ డైరెక్టర్ని చూసేవాళ్ళం గదా"

పార్వతి హడావుడిగా స్టూడియోలోని ప్రివ్యూ థియేటర్ వైపు నడిచింది. అందరూ అప్పుడే లోపలికి వెళ్తున్నారు. అంతా కలసి ముప్ఫయిమంది కంటే లేరు.

"అమ్మయ్య -ఇంకా మొదలు కాలేదు" అంది పార్వతి ఆయాసపడుతూ.

ప్రకాష్‌రెడ్డి లేచి డైరెక్టర్ సొలానస్‌ని పరిచయం చేసారు. ఆయన అర్జంటీనా దేశస్థుడు. 1970 ల నుండీ సినిమాలు తీస్తున్నాడు. రాజకీయ చైతన్యం కలిగించే సినిమాలు

తీశాడని చెప్పి ఆ దర్శకుడిని రెండు ముక్కలు మాట్లాడమన్నారు.

ఆయన తనకు ఇంగ్లీషు సరిగా రాదంటూ నెమ్మదిగా మాట్లాడాడు. "నేను తీసిన ఈ జర్నీ అనే సినిమా యివాళ లాటిన్ అమెరికన్ దేశాల పరిస్థితికి అద్దంపడుతుంది- ఆ దేశాలు యివాళ తాకట్టులో వున్నాయి- కాదు - తాకట్టు పెడితే వడ్డీ వ్యాపారి పరం అయిపోయిన ఆస్తుల్లా వున్నాయి. మా ప్రభుత్వాలు కీలుబొమ్మ ప్రభుత్వాలు. అవి మా దేశాల దరిద్రం పొగొట్టే ప్రయత్నం చేయకుండా మరింత దుర్భర దరిద్రంలోకి నెడుతున్నాయి. ఈ సినిమా తీసిన వెంటనే మా దేశాధ్యక్షుడు నా మీద పరువు నష్టం దావా వేశాడు. నా మీద హత్యా ప్రయత్నం జరిపించాడు. సినిమా విడుదలకాకుండా ఆపాడు. ఐతే అంతర్జాతీయంగా ఎంతో ఒత్తిడి తీసుకొచ్చి సినిమా ప్రదర్శించగలుగుతున్నాం. ఈ సంవత్సరం జనవరిలో కలకత్తాలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమా చూపించారు. అక్కడ అందరూ ఎంతో మెచ్చుకున్నారు. ఇపుడు మీరు కూడా సినిమా చూడండి." అని చెప్పి తను కూడా ప్రేక్షకుల్లోకి వచ్చి కూచున్నాడు. మరో రెండు నిమిషాల్లో సినిమా మొదలు పెట్టారు.

అర్జంటీనాకు దగ్గరలోని ఒక ద్వీపంలో మొదలయింది కథ. కథానాయకుడు పదిహేడేళ్ళ యువకుడు. అతని తల్లిదండ్రీ విడాకులు తీసుకున్నారు. తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకుంది. కుర్రవాడు.తల్లి దగ్గరే పెరుగుతున్నాడు. మారు తండ్రి అంటే ఆ కుర్రాడికి ద్వేషం. తల్లంటే యిష్టమే గాని ఆ మారు తండ్రిని అన్ని విషయాల్లోనూ సపోర్టు చేస్తుందనీ, తన తండ్రి తనకు రాసిన ఉత్తరాన్ని చించేసిందనీ తల్లిమీద కొన్ని కంప్లయింట్లు వుంటాయి. తన భవిష్యత్తు గురించిన అయోమయం, అధికారుల మీదా పెద్దవాళ్ళ మీదా తిరుగుబాటు, యవ్వనోద్రేకం, అల్లరి, ఆటపాటలతో అతని జీవితం గందరగోళంగా వుంటుంది. కొన్నాళ్ళకు ఆ గందరగోళాన్ని భరించలేక తండ్రిని కలుసుకోవాలని యింటినుంచి బైలు దేరతాడు. రాత్రింభగళ్ళూ ప్రయాణం చేసిన తర్వాత యిక రోడ్డు అయిపోతుంది.

అంతా నీళ్ళు - వరదలు- వరదలతో దేశమంతా మునిగిపోతోంది.

ఆ పిల్లవాడికి పడవ ప్రయాణం తప్ప గత్యంతరం లేదు.

ఆ మురికి నీళ్ళు యిళ్ళల్లోకి కూడా వస్తుంటాయి. జనం అలాగే బతకటం అలవాటు చేసుకుంటారు. ఆ మురుగు వాసనకు కడుపులో తిప్పి వాంతులొస్తుంటే, వాంతుల్ని రాకుండా ఆపే మందుల కోసం పరిశోధన చేసి, మందులు కనుక్కొని, అవి వేసుకుంటారు తప్పితే వరదలను ఆపుదామనుకోరు.

"ఆ వరదలను అప్పులకు సంకేతంగా సింబాలిక్‌గా వాడాడా?" పార్వతి మెల్లిగా అడిగింది.

"అలాగే కనిపిస్తోంది" అన్నాడు శ్రీనివాస్.

ఆ వరద నీళ్ళల్లో ఒక శవపేటిక కొట్టుకొస్తుంది. పడవ నడిపే మనిషి ఆ శవపేటిక నీ తాతదేనని ఈ కుర్రాడితో చెప్పి దాన్ని నాయనమ్మకు అప్పగించమని ఆ యింటికి తీసికెళ్తాడు. నాయనమ్మ మనవడిని చూసి సంతోషిస్తుంది. భర్త శవపేటికను చూసి "అయ్యో - నన్ను ఒదల్లేక మళ్ళీ ఒచ్చావా" అంటూ దానిని సమాధి స్థలం దగ్గరకు పడవలో తీసుకుపోతుంది.

అంతా నీళ్ళే - ఆ నీళ్ళనే వాటర్ ప్లాట్స్‌గా విదేశీయులకు అమ్ముతుంటారు. నాయనమ్మ తమ్ముడొచ్చి ఆమె స్థలాన్ని కూడా అమ్మమని బలవంత పెడతాడు.

ఆమె చచ్చినా అమ్మనంటుంది.

"అమ్మక ఏం చేసుకుంటావు? అవతల రోడ్లూ, వంతెనలూ, రహదారులూ, విమానాశ్రయాలూ, టవున్ హాల్సూ అన్నీ అమ్మేస్తుంటే నువ్వు నీ కాస్త స్థలంతో ఏం చేస్తావు" అని కేకలేస్తాడు.

"నా భర్త ఈ అమ్మకాలకు వ్యతిరేకి. వాయిసెస్ ఆఫ్ నాయిస్ అని రేడియో నడిపి ఈ పద్ధతుల్ని వ్యతిరేకించేవాడు. నేను ఎలా అమ్ముతాను" అంటుందామె. తాతయ్య గురించీ అతను నడిపే రేడియో గురించీ తెలుసుకుంటాడతను. ఇప్పటికీ ఆ ప్రాంతంలో ఒక పెద్ద డ్రమ్ము మోగుతుంటుంది. ప్రజల్ని హెచ్చరిస్తుంటుంది. ఈ అబ్బాయికి ఆ రిథమ్ చాలా నచ్చి ఆ డ్రమ్ వాయించే అతన్ని అడుగుతాడు.

"ఈ రిథమ్ నీవే కనిపెట్టావా?" అని.

అతను "ఇది చాలా సింపుల్ రిథమ్. మన గుండె కొట్టుకునేది ఈ రిథమ్‌లోనే" అంటాడు.

ఆ యువకుడు మళ్ళీ ప్రయాణం మొదలు పెడతాడు. దారిలో ఎర్రగౌనులో వున్న అందమైన అమ్మాయి తారసపడుతుంది. ఒక్కమాట మాట్లాడకుండా కొంత దూరం అతనితో ప్రయాణం చేస్తుంది.

"ఆ అమ్మాయిని చూస్తుంటే 'ఎర్రశాలువా కప్పుకుని మా యింటికొచ్చిందొక రివాల్వర్ 'అన్న శ్రీశ్రీ కవిత గుర్తొస్తోంది" అన్నాడు శ్రీనివాస్.

"ఔను. ఆ అమ్మాయిని విప్లవానికి సింబల్‌గా పెట్టినట్లున్నాడు" అంది పార్వతి.

పార్వతి వూహ కరక్టే. సినిమా అంతా అపుడపుడూ ఆ పిల్ల వాస్తూనే వుంది. ఒకసారి ఒక అరణ్యంలో కాసేపు యితనితో గడుపుతుంది. హఠాత్తుగా అతని కౌగిలిలోంచి మాయమవుతుంది. అడవుల్లో, ప్రవాసాల్లో సాగుతున్న విప్లవ కార్యకలాపాలకు సింబల్‌గా వున్నదా అమ్మాయి వ్యవహారం.

ఆ కుర్రాడు అర్జంటీనా రాజధాని వెళ్ళాడు. ఆ దేశ ప్రధాని మిస్టర్‌ఫ్రాగ్. కప్పకాళ్ళలాంటి కాదు. అతను దేశాన్ని కొత్త అప్పుల్లో ముంచే ఆలోచనలు చేస్తుంటాడు.

ఆ దేశంలో మోకాళ్ళ మీద నడిచే సంఘం ఒకటి పెడతారు. ఆ సంఘం

ప్రారంభోత్సవానికి అమెరికా అధ్యక్షుడుమిస్టర్ వుల్ఫ్ వస్తాడు. కప్పకాళ్ల అధ్యక్షుడు మాట్లాడతాడు.

"ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడటం ప్రమాదకరంగా తయారవటం వల్లా, చేతుల మీద నిలబడటం సాధ్యం కానందువల్లా మోకాళ్ళ మీద నిలబడటం తప్ప గత్యంతరం లేదనీ, అలాగే నిలబడటం నడవటం నేర్చుకోవాలనీ" చెబుతాడు.

ఇద్దరు అధ్యక్షులూ మోకాళ్ళమీద నిలబడి టెన్నిస్ ఆడతారు.

కావాలని తను ఓడిపోయి అమెరికా అధ్యక్షుడిని గెలిపిస్తాడు అర్జంటీనా అధ్యక్షుడు.

అర్జంటీనా అమ్ముడుబోయిన విధానమంతా చూస్తాడు ఆ యువకుడు.

ఆ తర్వాత లాటిన్ అమెరికన్ దేశాలన్నీ తిరుగుతాడు. బొలీవియా, మెక్సికో, కరీబియన్ అన్నిటా ఒకే పరిస్థితి.

దరిద్రం. నిరుద్యోగం. బానిసత్వం.

బొలీవియాలో అగ్గిపుల్లలు లెక్కపెట్టి అమ్ముతుంటారు. ఉప్పు డాలర్కి చిటికెడు చొప్పున అమ్ముతారు. బంగారు గనుల్లో పనిచేసే కార్మికుల జీవితాలు దారుణంగా వుంటాయి.

మనుషుల్ని రోజుకి మూడు డాలర్ల ధరకి అమ్మే వ్యాపారం సాగుతుంటుది.

మొత్తం దేశాలన్నీ తిరిగిన ఆ కుర్రాడు యిక తండ్రి కోసం తన వెతుకులాట మానేస్తాడు. ఈ ప్రయాణం తనకెంతో నేర్పిందనీ, తనేం చెయ్యాలో తెలుసుకోడానికి ఉపయోగపడిందనీ, తండ్రి ఈ రకంగా తనను గైడ్ చేసాడనీ–ఇక తండ్రి కోసం వెతుకులాట మానేసి తను జీవించాల్సిన తీరు గురించి ఆలోచిస్తాననుకోవటంతో సినిమా ముగుస్తుంది.

"నాలుగొందల సంవత్సరాల క్రితం కొలంబస్ అమెరికా రాకముందు యిక్కడి ఇండియన్లు చాలా హాయిగా వున్నారు. వాళ్ళ సంస్కృతి వాళ్ళకుంది. ఈ తెల్లవాళ్ళు వచ్చి అంతా నాశనం చేసారు. ఐనా మనం నాలుగువందల ఏళ్ళ పండగ చేసుకుంటున్నాం. ఎందుకు?"

అని ఆ కుర్రాడడిగిన ప్రశ్న ప్రేక్షకుల్ని కలవర పెడుతుంది.

సినిమా అయిపోయింది. ప్రేక్షకులు కొందరు డైరెక్టర్ని అభినందిస్తున్నారు.

పార్వతి కుర్చీలోంచి లేవలేక పోయింది. శ్రీనివాస్కి పార్వతి మనసు అద్దంలోంచి కనపడినట్లు కనపడుతోంది.

సమస్య మళ్ళీ మొదటికి వచ్చిందా అన్న అనుమానం వచ్చిందతనికి.

"లే - పార్వతీ - లే" అన్నాడు మెల్లిగా ఆమె భుజం మీద తడుతూ.

పార్వతి లేచి నిద్రలో నడిచినట్లు నడిచింది. బైట సారధి స్టూడియో లాన్లో ఆ డైరక్టరుతో యింకెవరో నలుగురు మాట్లాడుతూనే వున్నారు. పార్వతికి ఆ దర్శకుడితో మాట్లాడాలని వుంది గానీ ఏం మాట్లాడాలో తెలియలేదు.

ఊరికే అతని దగ్గరిగా వెళ్ళి నుంచుంది.

సినిమా చూడటానికి వచ్చిందే ముగ్గురు ఆడవాళ్ళు. ఇద్దరు వెళ్ళిపోయారు. పార్వతి దగ్గరకు రాగానే ఆ నలుగురూ కాస్త పక్కకు జరిగి పార్వతి ఆ దర్శకుడితో మాట్లాడే అవకాశం

యిచ్చారు. ఆయన పార్వతి ఏం చెబుతుందోనన్నట్లు ఆసక్తిగా ఆమె వంక చూశాడు.

పార్వతికి మీ సినిమా చాలా బాగుందని చెప్పటానికి గొంతు పెగల్లేదు. అతి ప్రయత్నంమీద గొంతు విప్పేసరికి దుఃఖం ముంచు కొచ్చింది. ఆ దుఃఖం చూసి దర్శకుడు కంగారుపడ్డాడు.

"మా దేశం కూడా యిట్లాగే అవుతోందని మాకు తెలుస్తూనే వుంది. కానీ మేమేం చెయ్యాలో మాకు తెలియటం లేదు. అప్పుల్లో కూరుకు పోతున్న దేశాన్ని ఒక్కొక్కళ్ళుగా ఏం చేసి రక్షించుకోగలమో మా స్వాతంత్రాన్ని ఎట్లా కాపాడుకోగలమో అర్థం కావటం లేదు".

కళ్ళనీళ్ళతో చెప్పింది పార్వతి.

"ఏం చేస్తారు? మీరైనా మేమైనా చేయగలిగింది పోరాటమే. అప్పులు ఒక ప్రమాద సంకేతం మాత్రమే. అట్లాంటి ప్రమాదాలు యింకెన్నో వున్నాయి. ప్రపంచంలో ఒకచిన్న గ్రూపు అతి శక్తివంతమైనదిగా తయారవటానికీ, ప్రపంచాన్నంతా తనకంట్రోలులోకి తెచ్చుకోటానికీ, తన ప్రయోజనాలు కాపాడుకోటానికీ కోట్లమందిని బలి చేయటానికి సిద్ధంగా వుంది. ఆ గ్రూపుతో యుద్ధంలోకి దిగటం తప్ప మరో మార్గం లేదు.. స్వేచ్ఛా స్వాతంత్రాలకోసం ఆరాటపడేవాళ్ళెవరూ ఈ యుద్ధం నుంచి తప్పించుకోలేరు. అందరం యుద్ధ రంగంలోనే వున్నాం.

ఆయుధాలు వేరు కావచ్చు. యుద్ధ విధానాలు వేరు కావచ్చు. కొందరు యుద్ధం చేయమనీ, ఆ యుద్ధంలో అర్థంలేదనీ చేతులు ముడుచుకు కూర్చోవచ్చు. కానీవాళ్ళు వున్నది మాత్రం యుద్ధరంగంలోనే - వాళ్ళు పీలుస్తున్న వూపిరి రక్తం వాసన వేస్తూనే వుంటుంది.

వాళ్ళ చెవులకు విన్పించేవన్నీ మానవ కపాలాలు పగిలిన చప్పుళ్ళే.

మనకి యిష్టమున్నా, లేకున్నా ఈ పరిస్థితి నుంచి దూరంగా పోలేము.

ఆ గ్రూపు- అతి చిన్న గ్రూపు యిపుడు గెలవచ్చు. గెలుస్తున్నట్లు కనిపించవచ్చు.

కానీ మనం కొత్త పద్ధతులు,కొత్త పోరాట విధానాలు సృష్టించేవారి పక్షంలో వుండాలి. లక్షల, కోట్ల ప్రజల్ని మన పద్ధతుల వైపు లాక్కొచ్చి వాటిని రక్షించుకుని నిలబెట్టుకోవాలి.

ఈ పనికోసం మా దేశంలోనూ, మీ దేశంలోనూ కూడా ఎంతోమంది తమ ప్రాణాలు అర్పించారు. అర్పిస్తున్నారు.

నేనేం చేయాలో నాకు స్పష్టత వుంది. నేను మూడవ ప్రపంచ దేశాల అశేష ప్రజానీకం పక్షమే వుంటాను. నేనేం చేసినా వాళ్ళ ప్రయోజనాల కోసమే.

మీరూ ఎంచుకోండి-"

పార్వతి భుజం మీద చేయి వేసి ప్రేమగా తట్టాడతను. వెళ్తున్నట్టు తలవూపి తనకోసం వేచి వున్న వాళ్ళతో కలిసి వెళ్ళిపోయాడు.

ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి-

ఏదో ఒకటి చెయ్యకుండా ఎలా వుండాలి?

కోకాకోలా కంపెనీ ఉద్యోగం మానెయ్యలేకపోతే కనీసం అది తాగొద్దనే ప్రచారమైనా చెయ్యొచ్చా-

అది సరైన పద్ధతేనా -

ఏం చెయ్యాలి- ఏ వుద్యమం - ఏ కార్యక్రమం

పార్వతి మనసు ప్రశ్నలలో మండుతోంది.

"శ్రీనివాస్ పార్వతి చేయి పట్టుకొని నడిపిస్తున్నాడు.

ఇద్దరూ నడుస్తున్నారు ముందుకో వెనక్కో తెలియని సందిగ్ధ స్థితిలో.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 22-29 జనవరి 1995*